సాక్షి
గుంటూరు
శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.4,500, మోడల్ ధర రూ.4,000 వరకు పలికింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 666 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

ఏడు మండలాల్లో వర్షం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలోని ఏడు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు ఫిరంగిపురం మండలంలో 14.8 మిల్లీమీటర్లు, కాకుమాను 5.6, చేబ్రోలు 4.4, వట్టిచెరుకూరు 4.2, దుగ్గిరాల 2.6, గుంటూరు పశ్చిమ 1, గుంటూరు తూర్పులో 0.2 మి.మీ చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ 28వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 131.2 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 212.4 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న రెండు,మూడు రోజుల్లో జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

నేడు డీసీఎంఎస్ మహాజన సభ సమావేశం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) మహాజన సభ సమావేశం చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి అధ్యక్షతన కన్నావారితోటలోని కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం తెలిపారు. పాలకవర్గ సభ్యులు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్) అధ్యక్షులు, ఇతర సొసైటీ అధ్యక్షులు, సంఘ సభ్యులు సమావేశానికి హాజరు కానున్నట్లు వెల్లడించారు.

'సంక్షేమం-అభివృద్ధి'పై వర్సిటీలో నేడు సదస్సు

సాక్షి, అమరావతి: గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉదయం ఓపెన్‌మైండ్స్ (ఫర్ బెటర్ సొసైటీ) ఆధ్వర్యంలో సంక్షేమం - అభివృద్ధి అనే అంశంపై సదస్సు జరగనుంది. ఈ సదస్సులో ప్రముఖ ఆర్థికవేత్త, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (న్యూపా) మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జంధ్యాల బీజీ తిలక్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.వెంకటరావు, సీనియర్ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకులు కేబీజీ తిలక్, ఓపెన్ మైండ్స్ సంస్థ అధ్యక్షుడు, ఏపీహెచ్‌ఈఆర్ఎంసీ మాజీ మెంబర్ సెక్రటరీ అండ్ సీఈఓ డాక్టర్ ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రసంగించనున్నారు. నాగార్జున విశ్వవిద్యాలయంలోని బాలమోహన్‌దాస్ ఆడిటోరియమ్‌లో ఈ సదస్సు ఉదయం 10.30 నుంచి జరుగుతుందని ఓపెన్ మైండ్స్ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎన్నారై కోటా ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ఎన్నారై కోటాలో ప్రవేశాలకు 2023-24 విద్యాసంవత్సరానికి గానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎన్నారై కోటాలో మిగిలిన సీట్ల కోసం అక్టోబర్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌లో గానీ నేరుగా గుంటూరు శివారుల్లోని లాంఫాంలో ఉన్న విశ్వవిద్యాలయంలోగానీ సంప్రదించాలని రామారావు సూచించారు.

లోక కల్యాణార్థం మన్యుసూక్త హోమం



అమరావతి: సర్వమానవాళి సుఖసంతోషాలతో, సిరిసంపదలతో తులతూగాలని స్థానిక అమరేశ్వరాలయంలో గురువారం మన్యుసూక్తహోమం నిర్వహించారు. స్థానాచార్యుడు కౌశికచంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, నవగ్రహ మండపారాధన, పుణ్యాహవాచన, అగ్నిప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు. మన్యుసూక్తహోమం నిర్వహించి అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా తుళ్లూరుకు చెందిన పంచముఖ ఆంజనేయ భక్తబృందం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరు గోపీనాథశర్మ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యం.. జగనన్న ఇచ్చే భాగ్యం

- రేపటి నుంచి జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష
- 45 రోజులు 259 ఆరోగ్య శిబిరాలు
- 15 రోజుల ముందుగానే ఇంటింటి సర్వే
- ఇంటి వద్దే ఏడు రకాల పరీక్షలు



ఫిరంగిపురం మండలం పునుగుపాడులో పైలెట్ ప్రాజెక్టుగా జరిగిన జగనన్న ఆరోగ సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అందరికీ సంపూర్ణ ఆరోగ్యభాగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈనెల 30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. 45 రోజులపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించనుంది. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇప్పటికే గ్రామాల్లో ఇంటింటికీ వైద్యసేవలు అందిస్తున్న సర్కారు ఇప్పుడు ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతోంది. ఆరోగ్య సురక్ష ద్వారా ఇప్పటికే ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టింది. అనారోగ్య పీడితులను గుర్తించి వైద్యశిబిరాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 15 వరకు వైద్య శిబిరాలకు కార్యాచరణ సిద్ధం చేసింది. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా అధునాతన చికిత్స అందించేందుకు చర్యలుచేపట్టింది. ఆరోగ్య సురక్ష అమలు కోసం జిల్లా నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ శివగోపాల్‌ను కలెక్టర్ నియమించారు.

ముమ్మరంగా సర్వే

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు సంబంధించిన ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి ఏడు రకాల పరీక్షలు నిర్వహించి కేస్ షీట్స్ సిద్ధం చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. అనంతరం వారికి కూపన్లు అందజేస్తున్నారు. ఆ కూపన్లతో ప్రజలు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలకు వెళ్లి వైద్య సేవలు పొందవచ్చు. ఈ శిబిరాలలో వైద్య పరీక్షలు, సేవలు అందుతాయి. 118 రకాల ఔషధాలు అందుబాటులో ఉంటాయి. అత్యాధునిక చికిత్స అవసరమైతే వైద్యులు సమీపంలోని ఆస్పత్రికి తరలించి ఉచితంగా వైద్యం అందిస్తారు. శస్త్రచికిత్సలు అవసరమైనా ఆరోగ్యశ్రీద్వారా చేస్తారు. రోగులు కోలుకునే వరకూ పర్యవేక్షించేలా ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో అనుసంధానం చేస్తారు. జిల్లాలో ఇప్పటికే ఫిరంగిపురం మండలం పొనుగుపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పైలెట్ ప్రాజెక్టుగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 414 మంది సేవలు పొందారు.

259 ప్రాంతాల్లో వైద్యశిబిరాలు

గుంటూరు అర్బన్ పరిధిలో 29 వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాలలో 230 వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి వైద్య శిబిరంలోనూ జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్, గైనకాలజిస్టుతోపాటు ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో ఉంటారు.

సద్వినియోగం చేసుకోవాలి

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఉచితంగా పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తాం. రోగి జబ్బు ఆధారంగా పెద్ద ఆస్పత్రులకు పంపి నాణ్యమైన చికిత్స అందిస్తాం. అవసరమైతే ఆరోగ్యశ్రీ ఆస్పత్రులలో చేర్పించి శస్త్రచికిత్సలూ చేయిస్తాం. ఈనెల 30 నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

-ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కలెక్టర్, గుంటూరు జిల్లా

సాహితీ లోకాన కీర్తి శిఖరం జాషువా



జాషువా విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

పాత గుంటూరు: మహాకవి గుర్రం జాషువా సాహితీ లోకాన కీర్తి శిఖరమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చెప్పారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహాకవి జాషువా జయంత్యుత్సవం నిర్వహించారు. జాషువా కళాపీఠం వ్యవస్థాపకులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అధ్యక్షత వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. నగరంపాలెంలోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ జాషువా గుంటూరు వాసి కావడం మనకెంతో గర్వకారణమని పేర్కొన్నారు. మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ జాషువా కవిత్వాన్ని కొనియడారు. కార్యక్రమంలో అధికారులు, కార్పొరేటర్లు, చైర్మన్లు, డైరెక్టర్లు, దళిత సంఘాల నేతలు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు తెనాలితో 'విశిష్ట' బంధం

నాయుడమ్మ విశిష్ట పురస్కారం స్వీకరించిన హరిత విప్లవ పితామహుడు



తెనాలిలో నాయుడమ్మ అవార్డును స్వీకరించిన డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ (ఫైల్)

తెనాలి: హరిత విప్లవ పితామహుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్‌కు తెనాలితో విశిష్ట అనుబంధం ఉంది. తెనాలికి చెందిన ప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పేరిట విశిష్ట శాస్త్రవేత్తలకు బహూకరించిన అవార్డును స్వీకరించిన వారిలో డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ ఒకరు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ ట్రస్ట్ పేరిట సంస్థ వ్యవస్థాపకుడు పి.విష్ణుమూర్తి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన శాస్త్రవేత్తలు 24 మందికి నాయుడమ్మ అవార్డులను బహూకరించారు. చివరగా 23వ అవార్డును ఇద్దరు విశిష్ట మహిళా శాస్త్రవేత్తలకు ప్రదానం చేశారు. ఇండో-జపనీస్ రిలేషన్స్ నేషనల్ కౌన్సిల్ మెంబరుగా పి.విష్ణుమూర్తి, 1986లో నాయుడమ్మ అవార్డును ప్రవేశపెట్టారు. 1988వ సంవత్సరానికి సంబంధించిన మూడో అవార్డును ఆ మరుసటి సంవత్సరం జనవరిలో డాక్టర్ స్వామినాథన్‌కు అందజేశారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రీసోర్సెస్‌కు, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు అధ్యక్షుడి హోదాల్లో డాక్టర్ స్వామినాథన్ ఈ కార్యక్రమానికి విచ్చేశారు. ఇక్కడి కొత్తపేటలోని ఎన్వీఆర్ కల్యాణమండపంలో 1989 జనవరి 30న జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఏపీ టానరీస్ లిమిటెడ్ డైరెక్టర్ రతీష్ వై.నాయుడమ్మ చేతులమీదుగా డాక్టర్ స్వామినాథన్‌కు అవార్డును బహూకరించారు. కిక్కిరిసిన ఈ సభలో డాక్టర్ స్వామినాథన్ 'ఫ్రంటియర్ టెక్నాలజీస్ ఇన్ రూరల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై 3వ నాయుడమ్మ స్మారక ఉపన్యాసం చేశారు. గ్రామీణ భారతదేశ పర్యావరణ భద్రతను పటిష్టం చేయటానికి ప్రణాళికాబద్ధమైన కృషి అవసరమని డాక్టర్ స్వామినాథన్ చెప్పారు. మహాత్మాగాంధీ సామూహిక ఉత్పత్తి అనే భావనను సాంకేతికత సమ్మేళనంలో మరింత ఎక్కువ ప్రయత్నాలతో గ్రామస్థాయిలో రాజకీయ కార్యక్రమాలుగా మార్చవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రయోజనం కోసం తమకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మిళితం చేసే జాతీయ గ్రిడ్ పరిశోధన, శిక్షణ కేంద్రాలు అవసరమని వివరించారు. దేశంలో పెరుగుతున్న జనాభాకు అవసరమైన ఆహార ధాన్యాల ఉత్పత్తికోసం పదిరకాల సవాళ్లను వివరించారు. నాటి సభలో ప్లానింగ్ కమిషన్ సభ్యుడు, ఇండో జపాన్ స్టడీ కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ అబిద్ హుస్సేన్, ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.అప్పారావు, ఏపీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ చైర్మన్ యూవీ వర్మ ప్రసంగించారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా రగ్బీ జూనియర్ జట్ల ఎంపిక

విజయవాడ: కర్నూలులో అక్టోబర్ ఒకటి రెండు తేదీల్లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఎంపిక చేశామని కృష్ణా జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జట్ల ఎంపిక గురువారం జరిగింది. ఎంపిక పోటీలకు 55 మంది క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరవగా, ప్రతిభచాటిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. బాలుర జట్టుకు కె.రాహుల్, ఎల్.మురళి, యు.వెంకటరమణ, పి.యశ్వంత్ కుమార్, బి.హరి సాయిబాబు, ఎం.లక్ష్మీనారాయణ, వై.జిక్రిరెడ్డి, అభిషేక్, టి.రాజమౌళి, జి.అమర్ సుభాష్ ఎంపికయ్యారని చంద్రశేఖర తెలిపారు.

కొండవీడు గొప్ప పర్యాటక ప్రాంతం



విల్లు నుంచి బాణాన్ని సంధిస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి

- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి
- చారిత్రక ప్రాంతం కొండవీడుపై మార్నింగ్ వాక్
- నగరవనం అభివృద్ధి పనులపై పరిశీలన
- పర్యాటక ప్రాంత పరిరక్షణ, ప్రగతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని వెల్లడి



మార్నింగ్‌వాక్‌లో సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి

యడ్లపాడు: శతాబ్దాల చారిత్రక సంపదను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో కొండవీడుకోట అభివృద్ధికి కృషి చేస్తోందని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని కొండవీడుకోటను మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన సందర్శించారు. తొలుత కొండపై వివిధ రకాల మొక్కలు నాటారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటకంగా కొండవీడును తీర్చిదిద్దేందుకు చేపట్టిన ప్రగతి పనుల ఛాయాచిత్రాల ప్రదర్శనను తిలకించారు. వాటి వివరాలను పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు వివరించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి కొండవీడుపై ఉన్న స్వాగత ద్వారం, పురాతన ఆలయాలు, కట్టడాలు, రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రంలో చేస్తున్న పలు అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. అలాగే వ్యూపాయింట్స్ మార్గాల్లోనూ, వాకింగ్ ట్రాక్‌పైన 12 కి.మీ. మేర మార్నింగ్ వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపై సాహస క్రీడల ఏర్పాటు అంశాలపై డెమో ప్రదర్శించారు. ఇందులో భాగంగా సీఎస్ నేతికొట్టు ఉన్న కొండపై ట్రెక్కింగ్‌లో పాల్గొని, విల్లు పట్టి బాణాలు సంధించారు.

అటు చారిత్రకం ఇటు పర్యాటకం

పర్యాటక ప్రదేశాల్లో కొండవీడుకోట రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంటుందని సీఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. మార్నింగ్ వాక్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కొండవీడు-నగరవనం కార్యక్రమంలో భాగంగా దశల వారీగా నిధులు విడుదల చేయడం తెలిసిందేనన్నారు. ఆయా నిధులతో సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పర్యాటకులను ఆకర్షించేలా పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా యువత కోసం సాహస క్రీడలను అందుబాటులోకి తీసుకురావడం కొండవీడు ప్రగతికి తార్కాణమన్నారు. దశలా వారీగా ఇక్కడ జరిగే ఆయా అభివృద్ధి పనులు ఎంతో సంతృప్తి నిచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ రాష్ట్ర దళాధిపతి వై.మధుసూదనరెడ్డి, జీవవైవిధ్య రాష్ట్ర బోర్డు చైర్మన్ డీఎంకే రెడ్డి, గుంటూరు అటవీ ముఖ్య సంరక్షణ అధికారి వై.శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరరావు, పల్నాడు, గుంటూరు జిల్లా కలెక్టర్‌లు శివశంకర్ లోతేటి, వేణుగోపాల్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, కొండవీడుకోట అభివృద్ధి కన్వీనర్ కె.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి రాజమార్గం

- శరవేగంగా జాతీయ రహదారి అభివృద్ధి పనులు
- పల్నాడుకే మణిహారంగా మారనున్న వైనం
- ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి
- ప్రయాణం సులభతరం
- రూ.403.22 కోట్లతో పనులు



శరవేగంగా నిర్మాణమవుతున్న దాచేపల్లి-మాచర్ల జాతీయరహదారి

గురజాల: రహదారులు అభివృద్ధికి సోపానాలు. ఏ ప్రాంతంలోనైనా రహదారులు అభివృద్ధి చెందితేనే అన్ని రంగాలూ సర్వతోముఖాభివృద్ధి అయి ఆ ప్రాంతాల ప్రగతి సాధ్యమవుతుంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పల్నాడు ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో ఇప్పటికే విద్య, వైద్యం, ఉపాధి పరంగా ఈ ప్రాంత ప్రజలకు అనేక రకాల ప్రయోజనాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేకూర్చారు. తాజాగా సుమారుగా 40 కిలోమీటర్లు రాష్ట్ర రహదారిగా ఉన్న దాచేపలి-మాచర్ల మార్గాన్ని జాతీయ రహదారిగా మార్చారు. ఇందుకు గాను రూ.403.22 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి. పల్నాడు ప్రాంతానికి ఈ రహదారి ఎంతో కీలకంగా మారనుంది. పల్నాడు ప్రాంతంలో పలు సిమెంటు ఫ్యాక్టరీలు ఉన్నాయి. అదేవిధంగా పలు కంపెనీలు ఇక్కడికి వచ్చేందుకు సిద్ధపడుతున్నాయి. రవాణా తేలిగ్గా జరగడంతో పాటు తెలంగాణ ముఖ్యంగా హైదరాబాద్ వెళ్లేందుకు ఈ మార్గం సౌకర్యవంతంగా ఉంటుంది. అదే విధంగా ప్రకాశం, కృష్ణా, రాయలసీమ వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుంది. ఈప్రాంతంలో నాగార్జునసాగర్, అనుపు, ఎత్తిపోతల వంటి పర్యాటక ప్రాంతాలున్నాయి. సిమెంటు ఫ్యాక్టరీలు ఉండటంతో ఈ రహదారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. ఈ మార్గంలో అనేక ప్రమాదాలు జరిగి మృత్యువాత పడిన ఘటనలు కోకొల్లలు. తాజాగా ఈ రహదారి అభివృద్ధికి శ్రీకారం చుట్టడంతో పల్నాడు ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి..

వెనుకబడిన పల్నాడు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సమష్టి కృషి తోనే సాధ్యమని పల్నాడు ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు నిరూపిస్తున్నారు. ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిల సమష్టి కృషితోనే పల్నాడు ప్రాంతం అభివృద్ధికి బాటలు పడుతుందని రాజకీయవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు ప్రాంతంలోని ప్రజలు పడుతున్న ఇబ్బందులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర మంత్రుల దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి నిధులు మంజూరు చేసి పనులు త్వరితగతిన జరిగేలా చూస్తున్నారు.

పల్నాడు అభివృద్ధికి దోహదం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పల్నాడు ప్రాంతం అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. జాతీయ రహదారి ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు రైతులకు, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగం. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చొరవతో కేంద్రం నుంచి నిధులు మంజూరై, వెంటనే పనులు ప్రారంభమవడం శుభపరిణామం.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే

మారనున్న పల్నాడు రూపురేఖలు



పల్నాడు ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి. దాచేపల్లి - మాచర్ల రహదారిని జాతీయ రహదారిగా మార్చి, విస్తరించడం వలన ప్రయాణం సులభంగా ఉండటంతో పాటు ప్రమాదాలు నివారించవచ్చు. వెనుకబడిన పల్నాడు ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. రహదారుల అభివృద్ధితోపాటు మెడికల్ కళాశాల ఏర్పాటుచేయడం పల్నాడు ప్రాంతం అభివృద్ధికి చిహ్నాలు.

– కాసు మహేష్‌రెడ్డి, గురజాల ఎమ్మెల్యే

దుర్గగుడికి విరాళాలు



విరాళం అందిస్తున్న దాతలు

విజయవాడ: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరిగే పలు సేవలకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు గురువారం విరాళాలు సమర్పించారు. హైదరాబాద్ ఉస్మాన్‌నగర్‌కు చెందిన పెమ్మసాని శ్రీరామ్, శ్రీలత కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116, శాశ్వత పూజలకు రూ.80 వేలు, గోసేవకు రూ.9 వేల విరాళాలు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మ వారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యం



చీరాలలో గుండె ఆపరేషన్లు చేయించుకున్న భార్యాభర్తలను పరామర్శిస్తున్న అశోక్‌బాబు

వేటపాలెం/చీరాల అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా చేయడమే ధ్యేయంగా కృతనిశ్చయంతో పనిచేస్తున్నారని రాష్ట్ర ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి యాదాల అశోక్‌బాబు పేర్కొన్నారు. వేటపాలెం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అశోక్‌బాబు గురువారం పరిశీలించారు. కార్యాలయంలోని రికార్డులు, మందులు పరిశీలించి, ఆరోగ్య కేంద్రంలో సేవలు ఎలా అందుతున్నాయో రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాడు-నేడు ద్వారా ప్రతి మండల కేంద్రంలో రెండు పీహెచ్‌సీలు ఉండేలా రూ.కోట్ల నిధులు ఖర్చు చేసి నూతన భవనాలు నిర్మించారని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 53 వేల మంది వైద్యులను నియమించామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.40 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయని చెప్పారు. ప్రతి కార్డుదారుడూ రూ.5 లక్షల లోపు ఉచిత వైద్యం పొందవచ్చని వెల్లడించారు. అనంతరం చీరాల జయంతిపేటలో ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలు గుండె ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకోగా వారిని ఇంటికి వెళ్లి అశోక్‌బాబు పరామర్శించారు.

గుండె.. లయ తప్పుతుండే!

వైఎస్ జగన్ హయాం.. బీసీలకు స్వర్ణయుగం



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళిగిరి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

కొరిటెపాడు: రాజకీయంగా బీసీలను, ప్రత్యేకించి రజకులను బలోపేతం చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతోందని శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా నియమితులైన నూతలపాటి వెంకటేశ్వరరావు అభినందన సభ గురువారం జరిగింది. అన్నదాన సత్రం చైర్మన్ పోకల వసంత్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ లు నూతలపాటి వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి రాష్ట్రంలో బీసీల స్వర్ణయుగం ప్రారంభమైందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలోనే అమరావతిరోడ్డులోని అన్నదాన సత్రానికి రజక సామాజిక వర్గానికి చెందిన పోకల వసంత్‌ను చైర్మన్‌గా, దుర్గాదేవిని డైరెక్టర్‌గా ఎంపిక చేయడం జరిగిందన్నారు. జిల్లా నాటక అకాడమీ డైరెక్టర్‌గా కె.శివప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రజక సామాజిక వర్గానికి చెందిన తుమ్మేటి శ్రీనును నియమించడం జరిగిందన్నారు. గుంటూరు జిల్లా న్యాయస్థానం చరిత్రలోనే తొలిసారిగా రజక సామాజిక వర్గానికి పోకల వెంకటేశ్వర్లు గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైనట్లు వెల్లడించారు. రజకులకు ఇంత విశేష ప్రాధాన్యత కల్పిస్తున్న వైఎస్సార్ సీపీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రజక సామాజిక వర్గం మొత్తం అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ బీసీలకు చేసిందేమీ లేదని తెలిపారు. ప్రత్యేకించి రజకులను అసలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు బందా రవీంద్రనాథ్, సైదా, జీపీ పోకల వెంకటేశ్వర్లు, రాచకొండ జాన్‌బాబు, జిల్లా నాటక పరిషత్ చైర్మన్ సాంబశివరావు, డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు, గనిక జాన్సీ, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

చిన్న వయస్సులోనే గుండె పోటు

- ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న గుండెజబ్బులు
- దీర్ఘకాలిక వ్యాధులు, వ్యాయామలేమి, పోషకాహార లోపం, దురలవాట్లే కారణం
- అప్రమత్తంగా ఉండాలంటున్న కార్డియాలజిస్టులు
- జీజీహెచ్‌లో కార్పొరేట్ తరహా వైద్యసేవలు
- నేడు వరల్డ్ హార్ట్ డే

గుంటూరు మెడికల్: సినీ హీరోలు, ప్రముఖ రాజకీయ యువ నాయకులు సైతం హార్ట్ స్ట్రోక్‌తో అకాల మృత్యువుకు గురవుతున్నారు. కళాశాల యువత సైతం హార్ట్ స్ట్రోక్‌కు గురవడం తీవ్ర ఆందోళనకరమైన విషయమని కార్డియాలజిస్టులు వెల్లడిస్తున్నారు. వ్యాధిపై అవగాహన కలిగి ఉండి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గుండె జబ్బు రాకుండా జాగ్రత్త పడవచ్చు. ఆధునిక జీవనశైలి వల్ల నేడు పల్లె, పట్టణం అనే తేడా లేకుండా యువకులు, పెద్దవారు అనే బేధాలు లేకుండా నేడు ప్రతి ఒక్కరు గుండెజబ్బుల బారిన పడి ప్రాణాలు కోల్పోవటంపై గుండెజబ్బు వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లబ్ డబ్ మంటూ నిమిషానికి 72 సార్లు కొట్టుకునే గుండెకు జబ్బులు రాకుండా ముందస్తు జాగ్రతలు ఎలా తీసుకోవాలో తెలియజేస్తూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్‌డేను నిర్వహిస్తున్నారు. స్విట్జర్లాండ్‌లో జెనీవాలోని వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సంస్థ 2000 సంవత్సరం నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

గుండెజబ్బు నెంబర్‌వన్ కిల్లర్....

ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 17.1 మిలియన్ మరణాలు గుండెజబ్బుల వల్ల సంభవిస్తున్నాయి. గుండె జబ్బు నెంబర్ వన్ కిల్లర్. గుండెజబ్బులు రావటానికి పొగాకు వినియోగం ముఖ్యకారణం. బీపీ, షుగర్, అధిక రక్తపోటు, ఊబకాయం, గాలికాలుష్యం, ఉద్యోగ, వ్యాపార, ఇతర కారణాలతో వచ్చే మానసిక ఒత్తిడి, శారీరక వ్యాయామం లేకపోవటం, మద్యం సేవించటం, సరిపడా నిద్రలేకపోవటం, అన్‌హెల్దీడైట్ తీసుకోవటం ప్రధాన కారణాలు. జిల్లాలో 25 గుండెజబ్బు వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతిరోజూ 60 నుంచి 90 మంది గుండెజబ్బు వైద్యం కోసం వస్తున్నారు.



గుంటూరు జీజీహెచ్‌లోని క్యాథ్‌ల్యాబ్ మిషన్



జీజీహెచ్ కార్డియాలజీ వైద్య విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

ప్రతి ఏడాది పెరుగుతున్న రోగులు....

జిల్లా వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో గుండెజబ్బు రోగులు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రతి ఏడాది జీజీహెచ్‌కు వచ్చే రోగుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతూ ఉండటంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక జీవనశైలి వల్ల 25 ఏళ్ల వయస్సు వారిలో గుండెజబ్బులు రావటం చాలా బాధాకరమని వైద్యులు పేర్కొన్నారు. 2021లో ఓపీ విభాగంలో 15,171 మంది, 2022లో 10,984 మంది, 2023 ఆగస్టు వరకు 4,677 మంది గుండెజబ్బు రోగులు చికిత్స పొందారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి....

జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండి, సమీకృత ఆహారం తీసుకోవాలి. మద్యపానం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులు నమలటం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. ఆహారంలో పండ్లు తీసుకోవాలి. ప్రతి రోజూ శారీరక వ్యాయామం చేయటం, ఒత్తిడికి దూరంగా ఉండటం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం గుండెజబ్బులను దరిచేరనీయకుండా చూసుకోవచ్చు.

వైద్యసేవలు పొందాలంటే...

జీజీహెచ్‌లో గుండె వైద్య సేవలు పొందాలనుకునే వారు అవుట్ పేషెంట్ విభాగంలోని 10 నెంబర్ గదిలో సోమవారం, బుధవారం, శుక్రవారం రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు వైద్య సేవలు పొందవచ్చు. అక్కడ వైద్యులు ఈసీజీ, 2డీ ఎకో, ట్రెడ్‌మిల్‌టెస్ట్ లాంటి గుండెజబ్బునిర్ధారణ పరీక్షలు చేసి అవసరం ఉన్నవారికి ఇన్‌పేషెంట్ విభాగంలో అడ్మిట్ చేసుకుంటారు. ఇన్‌పేషెంట్ విభాగంలో (డాక్టర్ పాదిలప్రసాద్ సూపర్‌స్పెషాలిటిబ్లాక్)లో 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటారు. హార్ట్ స్ట్రోక్ వచ్చినవారిని ఓపీకి తీసుకెళ్లకుండా నేరుగా వార్డులోకి తీసుకురావచ్చు. ఆరోగ్యశ్రీ కార్డు, తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి క్యాథ్‌ల్యాబ్‌లో రూ.లక్షలు ఖరీదు చేసే గుండె వైద్య సేవలు ఉచితంగా లభిస్తాయి. కార్డు లేనివారికి సైతం సీఎంసీఓ నుంచి అనుమతి పత్రం తెచ్చుకుంటే సేవలన్నీ ఉచితమే.

జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం..



గుంటూరు జీజీహెచ్ క్యాథ్‌ల్యాబ్‌లో అత్యాధునిక వైద్య పరికరాలతో ఉచితంగా కార్పొరేట్ కార్డియాలజీ వైద్య సేవలు అందిస్తున్నాం. యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, పేస్‌మేకర్, ఇతర వైద్య పద్ధతుల ద్వారా గుండె ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నాం. 2020లో 732 గుండె ఆపరేషన్లు, 2021లో 1074 మందికి, 2022లో 1294 మందికి, 2023 ఆగస్టు వరకు 1149 మందికి గుండె ఆపరేషన్లు చేసి ప్రాణాలు కాపాడాం.

– డాక్టర్ బొర్రా విజయ్‌చైతన్య, జీజీహెచ్ క్యాథ్‌ల్యాబ్ నిర్వాహకులు

హార్ట్ ఎటాక్‌ను ముందుగా గుర్తించవచ్చు...



గుండె పోటు వచ్చే అవకాశం ఉందా లేదా అనే విషయాన్ని ముందస్తుగానే గుర్తించే ఆధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. వచ్చే ఐదేళ్ల కాలంలో గుండె పోటు వస్తుందా, రాదా అనే విషయాలను సీటీ క్యాల్షియం స్కోర్ అనే వైద్య పరీక్ష చేసి నిర్ధారిస్తున్నారు. టీఎంటీ టెస్ట్ ద్వారా కూడా గుండెపోటును అంచనా వేస్తున్నారు. హార్ట్ ఎటాక్ వచ్చి కుప్పకూలిపోయిన వారికి ఛాతీపై రెండు చేతులు పెట్టి నిమిషానికి 30 సార్లు కార్డియాక్ మసాజ్ (సీపీఆర్) చేయటం ద్వారా ఆగిన గుండెను తిరిగి కొట్టుకునేలా చేయవచ్చు. అంబులెన్స్ వచ్చే వరకు లేదా హాస్పటల్‌కు వెళ్లే వరకు కార్డియాక్ మసాజ్‌ను ఆపకుండా చేయాలి. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండే గుండె మరణాలు తగ్గించవచ్చు.

– డాక్టర్ అంజిత్ ఉప్పుటూరి, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు

స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు

నరసరావుపేట: వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతి బాధాకరమైందని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి బాలకృష్ణ, ఏపూరి గోపాలరావు విచారం వ్యక్తం చేశారు. గురువారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. తన పరిశోధనలతో మేలైన వరి, గోధుమ వంగడాలను సృష్టించారన్నారు. 1943లో బెంగాల్‌లో చోటు చేసుకున్న క్షామాన్ని చూసిన స్వామినాథన్ తన మనసు మార్చుకుని వ్యవసాయ పరిశోధనల వైపు అడుగులు వేశారన్నారు. వ్యవసాయరంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం నియమించిన కమిటీలో స్వామినాథన్ కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్య సిబ్బంది

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ ప్రదీప్
- జీజీహెచ్ ఆధ్వర్యంలో నగరంలో అవగాహన ర్యాలీ

గుంటూరు మెడికల్: అవయవ దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుసుమ జీవన్ ప్రదీప్ అన్నారు. జీజీహెచ్ ఆవరణలో గురువారం అవయవ దానం ఆవశ్యకతపై ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ నుంచి నాజ్ సెంటర్ మీదుగా తిరిగి జీజీహెచ్ వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో వివిధ కళాశాలల నుంచి దాదాపు 1200 మందికి పైగా విద్యార్థులు పాల్గొని ప్లకార్డులు ధరించి నినాదాలు చేశారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవన్ ప్రదీప్ మాట్లాడుతూ అవయవ దానంపై అనేకమందికి పలు రకాలుగా అపోహలు ఉన్నాయన్నారు. ప్రజల్లో అపోహలు పోగొట్టి అవగాహన పెంచాలన్నారు. అవయవ దానం గురించి ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ అవయవ దానం గురించి ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. జీజీహెచ్‌లో గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తున్నారని, రాబోయే రోజుల్లో లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. రూ.25 లక్షలు విలువైన లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలను చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దేశంలో ఐదు నుంచి పది లక్షల మంది అవయవాల కోసం ఎదురు చూస్తున్నారని, అవయవాల కొరత ఉందని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే అవయవాలను దానం చేయాల్సిన బాధ్యత అందరి పై ఉందన్నారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఆసుపత్రిలో అవయవ దానం ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజని, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

జాషువా రచనలు స్ఫూర్తిదాయకం



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ, తదితరులు

గుంటూరు వెస్ట్ : నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా ఆధునిక సమాజానికి దిక్సూచిలాంటివారని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి కొనియాడారు. జాషువా 129వ జయంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు మందిరంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాస్టర్‌మైండ్స్‌కు ఆలిండియా స్థాయిలో ఫస్ట్ ర్యాంకు

సీఎంఏ ఇంటర్, ఫైనల్ టాప్–10 అత్యధికంగా 12 ర్యాంకులు



సీఎంఏ ఇంటర్ ఆలిండియా టాపర్ వాగ్దేవతో మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) మంగళవారం ప్రకటించిన సీఎంఏ ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల విద్యార్థులు అఖిల భారత స్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు అత్యధిక ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. గురువారం గుంటూరు బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మోహన్ మాట్లాడుతూ సీఎంఏ ఇంటర్, ఫైనల్ టాప్–10లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అత్యధికంగా 12 ర్యాంకులతో తిరుగులేని ఆధిక్యత కనబర్చారని తెలిపారు.

సీఎంఏ ఇంటర్ టాప్–50 ర్యాంకుల్లో అఖిల భారతస్థాయిలో 1వ ర్యాంకుతో పాటు ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులు 44 మంది ఉన్నారని చెప్పారు. ఈ విధంగా టాప్–10లో లక్కింశెట్టి వాగ్దేవ 1వ ర్యాంకు, వెన్నంరెడ్డి హేమంత్ 2వ ర్యాంకు, పాలెపు చరణ్ ధనుష్ 4వ ర్యాంకు, ఎం.మనస్విని 5వ ర్యాంకు, గాడంశెట్టి పవన్ నాగసాయి 6వ ర్యాంకు, పోపూరి వాసవీప్రియ 7వ ర్యాంకు, టింకాయల దీక్షిత్ 8వ ర్యాంకు, యెన్నేటి కార్తికేయ 9వ ర్యాంకు సాధించారని వివరించారు. అదే విధంగా సీఎంఏ ఫైనల్‌లో అఖిలభారతస్థాయిలో 2వ ర్యాంకుతో పాటు ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులు 23 మంది ఉన్నట్లు తెలిపారు. ఈ విధంగా ఫైనల్ టాప్–10లో పాకాలపాటి రాజేష్ 2వ ర్యాంకు, ఆసిఫ్ సయ్యద్ 3వ ర్యాంకు, గూడూరు రోహిత్ 7వ ర్యాంకు, నడిమింటి సత్యసాయి ఆహ్లాదిత 10వ ర్యాంకు కైవసం చేసుకున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రముఖ సీఏ విద్యాసంస్థలస్థాయిలో ఐసీఏఐ ప్రకటించిన సీఎంఏ ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ సాధించినన్ని ర్యాంకులను మరే విద్యాసంస్థ సాధించలేదని అన్నారు. మాస్టర్‌మైండ్స్‌కు అఖిల భారతస్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం ఇది 52వ సారి అని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను అభినందించారు.

చదరంగం పోటీలకు ఎస్వీఆర్ఎం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హరికృష్ణ

నగరం: రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎస్వీఆర్ఎం కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ వెల్లడించారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులకు గురువారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఇటీవల బాపట్లలో జరిగిన పోటీలలో కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఫణీంద్ర, గోపీకృష్ణలు ప్రతిభ కనబర్చి ఉమ్మడి గుంటూరు జిల్లా చదరంగం టీంకు ఎంపికయ్యారన్నారు. వీరివురు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి చదరంగం పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాడెంట్ బుచ్చియ్యచౌదరి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీఈడీ సాంబమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తైక్వాండో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు



తైక్వాండో ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్ఏ చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపిక కావాలన్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 220 మంది పోటీల్లో పాల్గొన్నారన్నారు. త్వరలోనే జట్టును ప్రకటించి రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు. తొలుత పోటీలను వెంకటేశ్వరరావు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేశ్వరరెడ్డి, కొసనా వేణుగోపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్ రంగా, కె.ప్రసాద్‌బాబు, దానేశ్వరరావు పాల్గొన్నారు.

వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్

ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ

గుంటూరు ఎడ్యుకేషన్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించడంపై ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యావ్యవస్థలో గత పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కాంట్రాక్టు లెక్చరర్లు అనే బానిస వ్యవస్థ ఉమ్మడి రాష్ట్రంలోకి వచ్చిందని తెలిపారు. కాంట్రాక్టు వ్యవస్థకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి, కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని అనేక సార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఏ ఒక్క ప్రభుత్వమూ హామీలు ఇవ్వడం తప్ప రెగ్యులరైజ్ చేయలేదని వివరించారు. సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడంతో పాటు ఆమోదింపచేయడం ద్వారా రాష్ట్రంలోని వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపారని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యావ్యవస్థలో కాంట్రాక్టు అధ్యాపకులనే బానిస వ్యవస్థను తొలగించి, పేద, బడుగు, బలహీనవర్గాల విద్యకు పెద్దపీట వేసినందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల కుటుంబాలు సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాయని తెలిపారు.